కృష్ణ III (క్రీ.శ. 939–67) తో చెలిమి చేయడమే కాకుండా అతడు తనకు ప్రియమిత్రుడని ప్రకటించుకొనగలిగాడు.

## వైదుంబులు

ఈ జిల్లా (చిత్తూరు)లో కొంతభాగం వైదుంబుల స్థానిక కుటుంబ అధికారానికి లోబడి ఉండింది. వీరి ముఖ్య పట్టణం ఈ జిల్లాలోనే ఉన్న వైదుంబప్రోలు లేక వైదుంబ పట్టణం. ఈ కుటుంబం వారి శాసనాలు చిత్తూరు, కడపజిల్లాలోనూ, మైసూరు రాష్ట్రానికి చెందిన కోలారుజిల్లాలోనూ లభించాయి. ఈ వంశానికి చెందిన 20 శాసనాలు ఈ జిల్లాలోనే లభించాయి. వీటి లిపినిబట్టి క్రీ.శ. 8,9,10 శతాబ్దాల కాలం నాటివి అని తెలుస్తోంది. వీటినుండి తెలుసుకోగ్గ విషయాలు అతి స్వల్పం. వీటిలో చాలా భాగం వీరశిలలు. యుద్ధభూమిలో మరణించిన వీరుల యొక్కయూ పశువుల దోపిడి (గో గ్రహణం) జరిగి నపుడు వాటిని మరలించు సందర్భాన చనిపోయిన వారి సంస్మరణార్థం నెలకొల్పిన స్మారకాలుగా ఉండడంవల్ల ఈ వంశం గురించిన వివరాలు తెలియడం లేదు.

ఈ పాలకులు యుద్ధ కండూతిగలవారుగా కనబడుతున్నారు. తరచుగా వీరు ఇరుగు పొరుగువారైన లొంకులులు, రేనాటిచోళులు, పెరుంబనప్పాడి బాణులు, నోళంబవాడి నోళంబులు మొదలైన వారితో యుద్ధాలకు దిగెడివారు. ఈ వంశంలోని మొదటి పరిపాలకుడు వైదుంబమహారాజు. ఇతడు తనవలె యుద్ధ కండూతిగల లొంకులులు అనే మరియొక వర్గం వారితో యుద్ధం చేశాడు. వైదుంబ సైన్యానికి అధిపతి గండర. ఇతడు రణరంగంలో మర ణించాడు. ఈకాలంలోనే వైదుంబులు మదనపల్లి తాలూకాలోని చిప్పిలినుండి రేనాటి చోళులను తరిమికొట్టి ఆక్రమించుకొన్నారు. వైదుంబ మహారాజు తరువాత సంకలి లేక గండ సంకలి అను నతడు పరిపాలకుడై నట్లున్నది. ఈ వంశంలోని గండత్రినేత్ర వైదుంబ మహారాజు అను మరియొక పరిపాలకుడు క్రీ.శ. 10 వ శతాబ్ద ప్రారంభంలో ఉన్న అధిక శక్తివంతుడు, అత్యాశ పరుడైన రాజు. అదనుదొరికినప్పుడల్లా ఇరుగు పొరుగు వారితో యుద్ధానికి సిద్ధపడే వాడు. పరిపాలనను చేపట్టగానే జటాచోడుని యుద్ధంలో జయించి అతని అధీనంలో వున్న రేనాడు 7000ను స్వాధీనం చేసుకొన్నాడు. ఇంకను ఇతడు మదనపల్లి తాలూకాలోని ముదివేడుగా గుర్తింపబడిన ముడుమడువు వద్దను, అనంతపురంజిల్లాలోని సొరెమడివద్ద నోళంబులతో రెండు యుద్ధాలు చేశాడు. ఈ రెండు యుద్ధాలోనూ విజయం పొంది కోలారు జిల్లాలోని కొంత భాగం మీద అధిపత్యాన్ని సంపాదించాడు. ఇతని తర్వాత రాజ్యానికి వచ్చినవాడు మనుజత్రినేత్ర. ఇతని వారసుడు భువన త్రినేత్ర. ఇతను క్రీ.శ. 973 లో పట్టాభిషిక్తుడయ్యాడు. ఇతని ఏలుబడిలో రేనాడు పూర్తిగా కాకపోయినా అందలి కొంత భాగం ములికినాడు, పాకనాడు ప్రాంతాలు ఉండేవి. ఇరిగయ మహారాజు, తుక్కరై కుమారు డైన నన్నిమరాయర్ మడుక మహారాజు, ఇతని కుమారుడు కలిగత్రినేత్రభీమ మహారాజు అను ప్రముఖులైన వైదుంబరాజులు శాసనములవలన తెలియు ఇతర ప్రముఖులు.

## పశ్చిమ గాంగులు, నోళంబ పల్లవులు :

ఈ జిల్లా (చిత్తూరు) లోని కొంత భాగంమీద ఆధిపత్యాన్ని వహించిన మరియొక వంశం పశ్చిమగాంగులు. క్రీ.శ. 4 వ శతాబ్దం ఉత్తరార్థంలో ఈ వంశంవారి రాజకీయ ప్రాబల్యానికి పునాదిపడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంమీద బాణుల ప్రాబల్యాన్ని తగ్గించే ఉద్దేశంతో పల్లవ రాజైన సింహవర్మన్ I పశ్చిమగాంగ వంశీయుడైన హరివర్మన్ అనే ప్రముఖుని (క్రీ.శ. 450–460) సామంతరాజుగా పట్టాభిషేకం గావించాడు. కాని పశ్చిమగాంగరాజ్యం శివమార II (క్రీ.శ. 788 – 812) పరిపాలనాకాల అంత్యదశలో రెండుభాగాలుగా చీలిపోగా ఒకభాగాన్ని కుమారుడైన మారసింహ; రెండవభాగం సోదరుడైన విజయాదిత్య పంచుకొన్నారు. పుంగనూరు తాలూకాలో వెలుగుచూసిన శానాధారంగా ఈ జిల్లాలో కొంత భాగం మారసింహుని వంతునకు వచ్చిన భూ భాగంలో ఉండినట్లుగ తెలుస్తోంది. తరువాత కాలానికి చెందిన--

1. ఉత్తమ చోళ – గంగ అని మరియొక పేరుగల శెన్‌బకప్పి పతి నాయకర్; 2. ఉత్తమ చోళ గంగన్ అని మరియొక పేరు గల వీర గంగన్ వెట్టుం అమరాభరణం; 3. ఉత్తమ చోళ గంగ అని మరి యొక పేరు గల సెల్వగంగ; 4. ఉత్తమ చోళ గంగ పద్మదేవ యొక్క కుమారు డైన సెల్వగంగ అను నీల నలుగురు గాంగ ప్రముఖుల పేర్లనుపుంగ నూరు తాలూకాలో లభించియున్న శాసనాలు పేర్కొంటున్నాయి.

వీరు ప్రధాన వంశములోని వారా లేక దాయాది వర్గంలోని వారా అనే విషయం తెలియడం లేదు. క్రీ.శ. 1004 వ సంవత్సరంలో వీరి ముఖ్యపట్టణం తలకాడును చోళులు స్వాధీనం చేసుకోవడంతో క్రమేపీ పశ్చిమగాంగుల పరిపాలనాధికారం మందగించి అదృశ్యమై పోయింది.

## నోళంబ పల్లవులు :

ఈ జిల్లా (చిత్తూరు) ఇంక కొంతకాలం మరియొక తరగతికి చెందిన నోళంబ లేక నోలంబపల్లవ వంశీయుల పరిపాలనలో ఉండేది. ఈ వంశానికి చెందిన 11 మంది పాలకులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. నోళంబవాడి 3200 వీరి ఆధిపత్యంలో ఉండింది. వీరు బాణులు, వైదుంబులు, చోళులు, రాష్ట్రకూటులు మొదలైనవారితో విభేదించి యుద్ధాలకు తలపడ్డారు.

ప్రాణాన్ని కాపాడండి. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రాణ దాన ట్రస్టుకు విరివిగా విరాళాలివ్వండి. ఈ విరాళాలపైన ఆదాయపు పన్ను రాయితీ లభిస్తుంది.

పేదలకు ప్రాణదానం చెయ్యండి!

పరమాత్ముడికి అత్యంత ఆప్తులు కండి!!

అధిక సామర్థ్యం గలవాడైన మహేంద్ర I క్రీ.శ. 878 వసం లో వంశపారపర్యంగా వచ్చిన రాజ్య పగ్గాలను చేపట్టగానే నోళంబులు బలాన్ని పుంజుకున్నారు. పరాక్రమశాలియైన మహేంద్ర జైత్రయాత్రను ప్రారంభించాడు. పశ్చిమగాంగ ప్రభువును, తనపై అధికారి రాచమల్ల I ఆజ్ఞ ననుసరించి మహేంద్రుడు పశ్చిమగాంగుల దాయాదుల అధీనంలో చిక్కుకొని ఉన్నటువంటి 'తలకాడు' ను జయించడానికి వారిపైకి దండయాత్రకు ఉద్యమించాడు. ఈ సందర్భంలోనే పులినాడు మీదికి దండు నడుపమని తన ఇద్దరు తాబేదారులైన కడువట్టి, మదువ అనువారిని నియోగించాడు. కడువట్టి అనునతడు ఈ జిల్లాలోని కొయట్టూర్ (పుంగనూరుకు దగ్గరోనున్న లడ్డిగం) మీదికి దండెత్తి దానిని వశపరచుకొన్నాడు. ఈ విషయం తెలియగానే బాణరాజైన విజయాదిత్య వీర చులమణి ప్రభుమేరు పెద్ద సైన్యంతో వచ్చి శత్రువులను తరిమివేశాడు. అతి ఘోరంగా జరిగిన ఈ యుద్ధంలో అనేకమంది వీరులు మరణించారు. ఈ జిల్లాలో లభించిన శాసనాలలో ప్రస్తుతించ బడిన మరియొక రాజు వీరమహేంద్ర II ఇతను కూడ వీరి వంశానికే చెందినవాడు. ఇతడు చోళరాజ్యంలోని తొండమండలం రాష్ట్రం మీదికి దండయాత్ర చేశాడు. దండయాత్రను ముగించుకొని తిరిగివచ్చిన తరువాత వీరమహేంద్ర II నోళంబవాడిని ప్రవేశించి, కోలారులో విడిదిచేసి, ఒక సామాన్య వ్యక్తికి అధికార పదవి నిచ్చాడు. అంతేకాకుండా ఈ జిల్లాలోని పులినాడు గ్రామాన్ని అతనికి బహూకరించాడు. ఈ పులినాడు క్రీ.శ. 10 వ శతాబ్దము ఉత్తరార్థంలోకూడా నోళంబుల అధికారంలోనే ఉండియున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే మరొక నోళంబ ప్రముఖుడైన ఇరివ నోళంబ II అనునతడు పులినాడులోని ఒక గ్రామాన్ని ఒక వర్తకుడికి దానం చేసియున్నాడు.

## కల్యాణి చాళుక్యులు, చోళ చక్రవర్తులు :

క్రీ.శ. 973 వ సంవత్సరంలో కల్యాణికి చెందిన పశ్చిమ చాళుక్యులు రాష్ట్రకూటులను ఓడించి, రాజ్యానికి వచ్చారు. కాని ఈ జిల్లామాత్రం చోళుల పరిపాలనాధికారానికి లోబడే ఉండింది. అటు తరువాత చోళ సింహాసనాన్ని అధిష్టించిన వారిలో పేర్కొనదగినవారు రాజరాజ చోళ I (క్రీ.శ. 985-1016), రాజేంద్ర I (క్రీ.శ.1012-1044), రాజాధిరాజ I (క్రీ.శ. 1052-1063), వీర రాజేంద్ర (క్రీ.శ. 1063-1069), అధిరాజేంద్ర (క్రీ.శ. 1067/68 - 1070), సుప్రసిద్ధులై ఖ్యాతిని గడించారు. వీరిలో రాజరాజ చోళుని I 30 సంవత్సరాల సుదీర్ఘ పరిపాలనా కాలం, చోళ సామ్రాజ్యం సుస్థిరతకు చోళ సార్వభౌమత్వం రూపుదిద్దుకొనడానికి పునాది వేయబడిన కాలం అని చెప్పవచ్చు. రాజరాజ సింహాసనాన్ని ఎక్కి పరిపాలనను ప్రారంభించు నాటికి రాష్ట్రకూటుల దండయాత్రలవలని దుష్ఫలితాల నుండి దేశం పూర్తిగా కోలుకోలేదు. అయినప్పటికీ ఈ రాజుయొక్క సమర్థవంతమైన, సుదీర్ఘ పరిపాలనలో చోళరాజ్యం చక్కని సుస్థిరమైన పరిపాలనావ్యవస్థను పొంపొందించుకొనిన విశాల సామ్రాజ్యంగా రూపు దిద్దుకొంది. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చోళరాజులు, ప్రజా సంక్షేమానికి, దేశాభివృద్ధికి ఎంతగా పాటు పడ్డారో వీరిచే ప్రకటించబడిన శాసనాలే సాక్ష్యం. చోళరాజుల పరిపాలనలో ఈ జిల్లాలోని వివిధ ప్రదేశాలలోని దేవాలయాలకు చేసిన దానాలను గురించి, ఇచ్చిన మడి మాన్యాల గురించి, వీటి అభివృద్ధికై తీసుకొనిన శ్రద్ధను గురించి, శాసనాలు వేనోళ్ల పొగడుతున్నాయి. దానంచేసిన భూములనుండి వచ్చే రాబడిని దేవాలయాల్లో నిత్యపూజాది కార్యక్రమాలు సక్రమంగా జరగడానికి వినియోగించబడేది. దేవాలయానికి ఆధార ద్రవ్య రూపంలో దానం చేసిన పశువులు, మేకలు, గొఱ్ఱెలు మొదలైన జంతువులు గొల్లలపరం చేయబడేది. దేవాలయంలో దీపాలు వెలుగించేటట్లు శ్రద్ధ వహిచడంతోబాటు దానికి కావలసిన నేతిని సమకూర్చడం కూడా వీరి ప్రధాన బాధ్యత. నూతన దేవాలయాలను నిర్మించడం, చెరువులను తవ్వించడం, పన్నులను విధించడం మొదలైన కార్యక్రమాలను గురించిన విశేషాలను మరికొన్ని శాసనాలు తెల్పుతున్నాయి.

క్రీ.శ. 1070 వ సంవత్సరంలో తూర్పు చాళుక్యుల రాజకుమారుడైన రాజేంద్రుడు 'కులోత్తుంగ' అన్న బిరుదును వహించి చోళ సింహాసనం అధిష్టించాడు (క్రీ.శ. 1070-1120). ఇతడు రాజ్యపాలనను చేపట్టడం చోళచరిత్రలో నవ శకానికి నాంది పలికినట్లైంది. వేంగి రాజ్యం, చోళ సామ్రాజ్యంలోని ఒక రాష్ట్రంగా ఏర్పడింది. అందుచేత ఈ పరిపాలకులు చాళుక్య - చోళ చక్రవర్తులుగా గుర్తింపబడ్డారు. శాంతికాముకుడైన ఈ రాజు అనవసర యుద్ధాల జోలికిపోకుండ తన ప్రజల క్షేమమే తన పరమావధిగా వ్యవహరించాడు. కులోత్తుంగ I తరువాత వరుసగా విక్రమచోళ (క్రీ.శ. 1118-1135), కులోత్తుంగ చోళII (క్రీ.శ. 1135-1150), రాజరాజ II (క్రీ.శ. 1146-1173) ఇంకనూ రాజాధిరాజ II పరిపాలనను చేపట్టారు.

**(సశేషం)**